# మరణానంతర ఊహ

కథలు చెప్పడంలో ఊహకు చాలా కీలక స్థానం ఉంది. కథకులు ఊహాత్మక సన్నివేశాల ద్వారా తమ వాదనను ప్రతిపాదిస్తారు. మనుషుల ఆశలకూ, భయాలకూ, ఊహాత్మకంగా రూపకల్పన చేస్తారు. జీవితాన్ని ఊహాత్మకంగా పున సృష్టిస్తారు. కథా శిల్పంలో ఊహ ఒక ముఖ్య సాధనం. ఊహించకుండ ఎవరూ కథలు రాయలేరు. కానీ ఊహను ఒక సాధనంగా అర్థం చేసుకొని సృజనాత్మకంగా ప్రయోగించడం వేరే సంగతి. దానికి చాలా నేర్పు కావాలి. ముందు కథా రచనలో శిల్పానికి తగు ప్రాముఖ్యం ఇచ్చి దానిని ప్రత్యేకంగా అధ్యయనం చేసే అలవాటు పెరగాలి.

మనిషి ఊహకు ఏ అవధులూ లేనట్టే కాల్పనిక సాహిత్యంలో అభివ్యక్తికి (ఎక్స్‌ప్రెషన్) సంబంధించిన వైవిధ్యానికి కూడ ఏ అవధులూ ఉండనవసరం లేదు. 'రూపం', 'శిల్పం', 'శైలి' అనేవి ఈ వైవిధ్యాన్ని అర్థం చేసుకోవడానికి మనం ప్రయోగించే మాటలు మాత్రమే. నిజానికి మనిషి తన ఊహా శక్తికి పూర్తి స్వేచ్ఛనిస్తే సాహిత్యంలో సాధించగల అభివ్యక్తి వైవిధ్యాన్ని అర్థం చేసుకోవడానికి ఈ పదాలు సరిపోవు. కానీ, ప్రగతిశీల రాజకీయాల ప్రభావం తెలుగు సాహిత్యం మీద చాలా బలంగా ఉండడం వస్తు రీత్యా ఆ సాహిత్యానికి సార్థకతనూ వైవిధ్యాన్నీ కల్గించడానికి ఎంతగా దోహదం చేసిందో అభివ్యక్తి విషయంలో అంత మేలు చేయకపోగా అనేక పరిమితులు పెట్టినట్టుంది. సాహిత్యం సామాజిక ప్రయోజనాన్ని సాధించాలనే తపన, కథా వస్తువుకు పూర్తి ప్రాముఖ్యం ఇచ్చి అభివ్యక్తి అనేది తేటతెల్లంగా 'ఆవు నాలుగు కాళ్ళ గల జంతువు' అనే పద్ధతిలో ఆ వస్తువును వ్యక్తం చేస్తేనే అది అభ్యుదయ సాహిత్యం అవుతుంది అనే దృక్పథానికి దారి తీసింది. 'సోషలిస్టు వాస్తవికత' అనే తొలినాటి సోవియట్ సాహిత్య సిద్ధాంతం ఈ రోజు పెద్దగా ప్రచారంలో లేదు గానీ అది అలవరచిన ఈ వైఖరి తెలుగులో అభ్యుదయ సాహిత్యాన్నే కాక మొత్తంగా తెలుగు కథా సాహిత్యాన్ని (కొద్ది మినహాయింపులతో) ఇంకా వదిలి పెట్టినట్టు లేదు. తెలుగులో కథా సాహిత్య శిల్పం మొత్తం మీద ఇంకా 'రియలిజం' పరిధులు దాటి పోలేదు. నిజ జీవితంలో లాగ తెలుగు కథా సాహిత్యంలో కూడ కాలం ఎప్పుడూ గతం నుండి భవిష్యత్తు వైపే ప్రవహిస్తుంది. కార్యకారణ సంబంధాలు కర్త కర్మ క్రియలలాగ ఉండవలసిన చోటే ఉంటాయి. చైతన్యాన్ని ఎప్పుడూ పదార్థమే నిర్ణయిస్తుంది. 'శాస్త్రీయ దృక్పథం' పాటించాలన్న నియమం లేని పిల్లల సాహిత్యానికి మాత్రమే గురుత్వాకర్షణ సిద్ధాంతాన్నీ హేతువాద తర్కాన్నీ తిరస్కరించే లైసెన్స్ ఇవ్వబడింది.

ప్రతీ రాజకీయ దృష్టి విశేషం వెనుక ఒక మానసిక వైఖరి ఉంటుంది. (అంటే అర్థం రాజకీయమంతా 'సబ్జెక్టివ్' అని కాదు - సబ్జెక్ట్, ఆబ్జెక్ట్ అనే వాటిని వేరు చేయడం అంత సులభం కాదని మాత్రమే) వస్తువులో విప్లవాన్ని కాంక్షించే వాళ్ళు రూపంలో సాధారణంగా

సంప్రదాయబద్ధులయి ఉంటారన్న ఆనవాయితీ ఇవ్వాళ పుట్టింది కాదు. అంతిమ విముక్తిని గురించి మాట్లాడే ప్రవక్తలు నిత్య జీవితంలో ప్రయోగాత్మకత పట్ల అసహనాన్ని ప్రదర్శించడం కూడ ఈ రోజు ఒకరు కొత్తగా కనిపెట్టి చెప్పవలసిన సంగతి కాదు. సాహిత్యంలో అభివ్యక్తి వైవిధ్యం ఒక మోతాదు మించితే అసహనంగా స్పందించే రాజకీయ వైఖరి కూడ ఈ కోవకు చెందిన ప్రవర్తనా విశేషమే. ఈ అసహనం లక్ష్య సాధనకు అవసరమైన క్రమశిక్షణ పేరిట ఆమోదం కోరుకుంటుంది. ఏ లక్ష్య సాధన కయినా క్రమశిక్షణ అవసరమే కానీ, తాము ఈ ప్రపంచాన్ని వివరించడానికి గీచిన నాలుగు గీతల మధ్య ఇమడని కొత్త విషయాలు ఎదురయినప్పుడు సిద్ధాంత వేత్తల మనసులను ఇబ్బంది పెట్టే అభద్రతా భావం నుండి పుట్టే అసహనాన్ని క్రమశిక్షణ పేరిట సమర్థించుకోవడం జరుగుతున్నదేమో గమనించకుండా ఆ వాదనకు ఆమోదం ఇవ్వడం పొరబాటు అవుతుంది.

కాల్పనిక సాహిత్యం 'వాస్తవికతా' నియమాలేవీ పాటించనవసరం లేదనీ, పాటించనంత మాత్రాన అది భావ వాద సాహిత్యం అయిపోదనీ, నిజానికి అత్యంత ప్రగతిశీల స్వభావం గల సందేశాన్ని 'అవాస్తవిక' ఊహాశిల్పం ద్వారా ఇవ్వవచ్చుననీ ఇతర భాషల సాహిత్యం చదివితే అర్థం అవుతుంది. ఉదాహరణకు అర్థరహితంగా అనిపించే కథనశైలి ద్వారా ఆధునిక జీవితంలోని అర్థరాహిత్యాన్ని బలంగా చూపించే రచనలు కాఫ్కా కాలం నుండి యూరప్ సాహిత్యంలో చాలా వచ్చాయి. కానీ ఆధునిక జీవితం అర్థరహితమా అని అడగవచ్చు. దానిని అర్థరహితంగా చూపించడం పోరాటాల నుండి పక్క దోవ పట్టించే తప్పుడు చైతన్యం అని విమర్శించవచ్చు. ఈ తార్కిక అభ్యంతరంతోనే మార్క్సిస్టులు అధి వాస్తవిక సాహిత్య శిల్పాన్ని చాలా కాలం తిరస్కరించారు. సామ్రాజ్యవాద పతన సంస్కృతి నుండి పుట్టిన పెటీ బూర్జువా నైరాశ్యవాదం అన్నారు. ఇప్పటికీ 'రియలిజం' పరిధి దాటి పోయే శిల్ప సంబంధమైన ప్రయోగాలను అనుమానంగా చూసే అలవాటు పోలేదు. ప్రతీ ఆలోచనా రీతికీ ఒక వర్గ మూలాన్ని వెతికే వైఖరే చాలా యాంత్రికమైనది. జీవితంలో అర్థం కానిది ఎప్పుడూ ఎంతో కొంత ఉంటుంది. అది తాత్విక మీమాంసకూ సాహిత్య వ్యధకూ వస్తువు అవుతుంది. కానీ ఇక్కడ చర్చ దాని గురించి కాదు. జీవితం మౌలికంగానే అర్థరహితమా అనే ప్రశ్న వేసుకుందాం. మధ్య యుగాలలో దేవుడు, కర్మమొదలయిన భావాలు జీవితానికి అర్థం చెప్పేవి. అది నిజానికి తర్కానికి అందే అర్థం కాదు. అది జీవితానికి అర్థం చెప్పలేని తనాన్ని ఒప్పుకోవడం తప్పవేరే కాదు. కానీ అప్పటికి అదే జీవితానికి ఉండే అర్థం. అర్థం చేసుకుంటూ కూడ అర్థం కాని ఆ జీవితంలో చాలా బలమయిన అర్థరాహిత్యాన్ని మనుషులు అనుభూతి చెందుతారు. దీని ఫలితమైన మీమాంస, వ్యధ ఆనాటి సాహిత్యంలోఅనేక సందర్భాలలో కనిపిస్తుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థతో మొదలయిన ఆధునిక కాలం హేతుబద్ధమైన వైజ్ఞానిక తర్కానికి మానవ ఆలోచనలో ప్రధాన స్థానం కల్పించింది. (అప్పటి వరకు దానికొక స్థానం లేనే లేదని

కాదు) జీవితాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకునే ఆలోచనారీతిని బాగా అభివృద్ధి చేసింది. జీవితాన్ని సంపూర్ణంగా కాకున్నా మౌలికంగా అర్థం చేసుకోవడం సాధ్యం అనే విశ్వాసాన్నీ, దానికి కావలసిన విజ్ఞానాన్నీ ఆధునిక యుగం పెంపొందించింది. అయితే అదే ఆధునిక యుగం మనుషుల జీవితాలను శాసించే ప్రబలమయిన శక్తులను సృష్టించింది. పెట్టుబడి, రాజ్యం అనేవి ఈ శక్తులు. వీటిని లోతుగా విశ్లేషిస్తే ఏదో ఒక మేరకు తార్కికంగా అర్థం చేసుకోవచ్చు. అయితే వాటి 'అర్థం' పైకి కనిపించేది కాదు. జీవించే క్రమంలో సహజంగా అనుభవంలోకి వచ్చేదే వాటి అసలు అర్థం కాదు. వాటిని అర్థం చేసుకోవడం అనే చర్య జీవించడం అనే చర్యకు సమాంతరం కాదు. ఈ రకంగా అవి అర్థవంతమయి ఉండి కూడా అర్థరహితమయినవే. అంతే కాదు. ఒక విషయాన్ని 'అర్థం చేసుకోవడం' అనేది కేవలం వైజ్ఞానిక ప్రక్రియ కాదు. ఒక విషయంలోని తర్కాన్ని మనం అర్థం చేసుకోగలిగినా ఆమోదించలేక పోవడం దాని అవసరాలతో మమేకం కాలేకపోవడం అనేది కూడ 'అర్థరాహిత్యం' అనే భావంలో ఇమిడి ఉంది. అంటే 'అర్థవంతం', 'అర్థరహితం' అనేవి కేవలం తార్కిక భావాలు కావు. అవి నైతిక భావాలు కూడా. ఎవ్వరికీ ఏ అన్యాయం చేయని వాళ్ళు కష్టాలకు లోను కావడం అనేది మనం ఎన్ని కర్మ సిద్ధాంతాలు నమ్మినా, ఎంత సైన్స్ చదివినా 'అర్థం'చేసుకోలేము. అంటే దానికి సమ్మతించలేము. ఈ అర్థంలో ఆధునిక రాజ్యం, పెట్టుబడి అర్థరహితమయినవే. అవిశాసించే జీవితం అర్థరహితమయినదే. శిల్పం రీత్యా అర్థరహితంగా అనిపించే సాహిత్య శైలి దీనిని బాగా వ్యక్తం చేస్తుంది. యుద్ధ వ్యతిరేక సాహిత్యం దీనికొక మంచి ఉదాహరణ. యుద్ధాలకు కార్యకారణ విశ్లేషణ చేసి ఒక మేరకు 'అర్థం' చెప్పుకోవచ్చు కాని నైతికంగా అవి అర్థరహితమయినవే కాబట్టి వాస్తవిక శైలి కంటె అబ్సర్డ్ శైలే యుద్ధ వ్యతిరేక సాహిత్యానికి బాగా అతికింది.

ప్రస్తుత రచనకు తిరిగి వద్దాం. అన్ని మానవ నాగరికతలలోనూ, మనిషి ఊహను చాలా బలంగా ఆకర్షించిన విషయాలలో మరణానంతర జీవితం ఒకటి. ప్రాచీన సాహిత్యంలో - అన్ని భాషలలోనూ - మరణానంతర జీవితానికి సంబంధించిన ఊహ ఒక ముఖ్య కథా వస్తువును కల్పించింది. ఈ మరణానంతర జీవితం గతంతో ముడి పడి ఉంటుంది. అపరిపూర్ణమైన ఈ జీవితంలోని ఖాళీలను మరణానంతరం పరిపూర్తి చేసుకునే ఊహ అన్ని మతాలలోనూ ఒక ముఖ్య విషయం. మతం 'హృదయం లేని ఈ ప్రపంచానికి హృదయం' అని మార్క్స్ అంటాడు.హృదయం లేని తనం ఒక అంశంలో దోపిడీ దౌర్జన్యాలకూ అణచివేతకూ సంబంధించిన విషయం. మార్క్స్ బహుశా దానికే ప్రాధాన్యం ఇచ్చాడు. ఈ లోకంలో న్యాయం లేదు. కష్టానికి తగిన ప్రతిఫలం రాదు. మనిషికి మనిషిగా గుర్తింపు లేదు. ఈ లోటును ఊహాత్మకంగా పూర్తి చేసుకునే కాల్పనిక సాధనం మరణానంతర జీవితం అనే ఆలోచన. అయితే వాస్తవంలో మనుషులు వ్యవస్థాగతమయిన ఈ జీవిత అపరిపూర్ణతను మానవ అస్తిత్వంలో ఎప్పుడూ ఉండే లోటుతో పాటే చూస్తారు. రెండింటినీ మనం సిద్ధాంత రీత్యా వేరు చేయవలసిందే. జీవితంలో

మనుషులు కోరుకునేది ఏదీ పరిపూర్ణంగా దొరకదు. శ్రమకు తగిన ఫలం, వ్యక్తిత్వానికి తగిన గుర్తింపు మాత్రమే కాదు. ప్రేమ, సౌందర్యం, సంతోషం, ఏదీ మానవ జీవితంలో పరిపూర్ణంగా లభించదు. దయ, సాహసం, దాతృత్వం వంటి గుణాలేవీ మనుషులు పరిపూర్ణంగా ప్రదర్శించలేరు. మానవ జీవితంలో అన్ని కోణాలలోనూ ఉన్న ఈ అపరిపూర్ణతకు శ్రమ దోపిడీ, అణచివేత, అసమానత, పేదరికం వంటి వ్యవస్థాగతమయిన విషయాలు కొంత మేరకు కారణం. కానీ వాటినన్నిటినీ వడబోసినా, మానవ అస్తిత్వానికి స్వాభావికమయిన అపరిపూర్ణత మిగిలి పోతుంది. మనిషి ఆలోచన మట్టుకు పరిపూర్ణతను భావించుకోగలదు. బలంగా కాంక్షించగలదు. దాని కోసం తపించగలదు. నిజానికి ఆ తపన మనిషిని ఆచరణకు కదిలించే శక్తులలో ఒకటి. మనిషిలో ఆ తపనే లేకపోతే మానవ చరిత్ర ఈ విధంగా ఉండేదే కాదు. బహుశా చరిత్ర అనేదే ఉండేది కాదేమో. 'హృదయం లేని' ఈ ప్రపంచంలో ఈ తపన పూర్తిగా తీరదు. కాబట్టి పరిపూర్ణమైన మరణానంతర జీవితంలో మనుషులు దానిని ఊహాత్మకంగా తీర్చుకుంటారు. అక్కడ జీవితం నిజంగానే అజరామరం. అక్కడ పరాక్రమానికి పిరికితనం అడ్డం రాదు, సౌందర్యానికి వయస్సు ఆటంకం కాదు. అక్కడ సమృద్ధే తప్ప లేమి లేదు. అందరూ దైవ సమానులే కాబట్టి హెచ్చు తగ్గులు లేవు. వ్యవస్థాగతమయిన అసమానతలకు, వ్యవస్థతో సంబంధం లేని జీవిత అపరిపూర్ణతకు ఆ ఊహలో ఏక సమయంలో పరిహారం దొరుకుతుంది.

మతంతో కలగలసి పోయిన ఈ మరణానంతర ఊహ కాలక్రమంలో పురోహితుల చేతిలో చిక్కి పాలక భావజాలానికి ఉపయోగపడింది. మరణానంతర సమృద్ధి, సమాన ప్రతిపత్తి, పరమాత్మలో సకల ఆత్మల విలీనం వంటి ఊహలను ఈ లోకంలోని వ్యవస్థాగతమయిన అన్యాయాలకు పరిహారంగా పురోహితులు చూపించగలిగారు. ఇది చాలా శక్తివంతమైన భావజాలానికి దారి తీసింది. ఈ భావజాలం నుంచి పీడిత ప్రజలను విముక్తి చేయడం కోసం కృషి చేయాలని అభ్యుదయ ఉద్యమాలు గుర్తించాయి. ఈ విషయంలో ఆ ఉద్యమాల ఆచరణ ఇంకా చాలా శక్తివంతంగా సాగవలసి ఉంది. 'పునాది ముందు మారితే ఉపరితలం తరువాత మారుతుంది' అనే వైఖరి వదులుకోవాలని ఈ మధ్య విమర్శకులు గుర్తిస్తున్నారు. అంతేకాదు భావజాలం అనేది ప్రజల మెదళ్లలో పాలక వర్గాలు బలవంతంగా చొప్పించే కృత్రిమ ఆలోచన అనే అవగాహన కూడ వదిలించుకోవాలి. ఉద్యమాలు భావజాలం ప్రభావాన్ని సీరియస్‌గా పట్టించుకోవాలని హెచ్చరించే విమర్శకులు సహితం భావజాలాన్ని అర్థం చేసుకోవడంలో ఈ పొరబాటు అవగాహనకు లోనవుతున్నారనిపిస్తుంది.

మరణానంతర జీవితానికి సంబంధించిన ఊహ మనిషిని బలంగా ఆకర్షిస్తుంది. కాబట్టే అది పాలక భావజాలానికి అంతగా ఉపయోగపడగలిగింది. పాలక భావజాలం మూలాలు వెతికితే మనిషికి స్వాభావికమైన అవసరాలు, లక్షణాలు, ప్రవర్తనారీతులు, ఆలోచనా సరళి తగులుతాయి. ఇవే భావజాలానికి 'కారణం' కాదు. భావజాలానికి కారణం, అవసరం వ్యవస్థ

నుండే వస్తాయి. కానీ భావజాలానికి బలం చేకూర్చే మూలాలు మానవ అస్తిత్వానికి స్వాభావికమైన గుణాలలో ఉంటాయి. భావజాలం సాధించేది అప్పటి వ్యవస్థాగతమైన ప్రయోజనాలనే. కానీ అది ఆధారపడేది మానవ అస్తిత్వానికీ స్వభావానికీ సార్వజనీనంగా ఉండే లక్షణాల ప్రత్యేక విశదీకరణపైన. అందుకే భావజాలాలు అంత బలంగా ఉండగలుగుతాయి. భావజాలానికి ఉండే బలం కేవలం అది కాపాడే భౌతిక ప్రయోజనం నుండి వచ్చేటట్టయితే ఏ పాలక భావజాలమూ ఇంత బలంగా ఉండనవసరం లేదు.

కమ్యూనిస్టు పాలిత దేశాలు బూర్జువా సంస్కృతి నుండి తమ సమాజాలను కాపాడడానికి ఇనుప గోడలు లేపి గ్రంథాలయాలను నిర్దాక్షిణ్యంగా వడబోసి ముద్రణాలయాలను నిషేధించి నానా తంటాలు పడినా, ఇనుప గోడలలోని కనిపించని బీటల నుండి గవాక్షాల నుండి సామ్రాజ్యవాద సంస్కృతికి సంబంధించిన గాలులు లోనికి ప్రవేశించగలిగాయంటే ఆ సంస్కృతిలో మనిషిని బలంగా ఆకర్షించే విషయం ఉండడమే దానికి కారణం. మనిషి ఈ ప్రపంచాన్ని తన కోసం వెలిసిన ఒక భోజ్య వస్తువుగా చూడడం బూర్జువా సంస్కృతికి సంబంధించిన ప్రధాన లక్షణం. ఇది పెట్టుబడిదారులు కృత్రిమంగా తయారు చేసి మనందరి మెదళ్లలోకి చొప్పించిన సంస్కృతి కాదు. ప్రపంచాన్ని ఒక భోజ్య వస్తువుగా చూసే వైఖరి మనుషులందరినీ సర్వత్రా ఆకర్షిస్తుంది. దానికి స్థానం కల్పించని సంస్కృతి ఏదీ లేదు. (ఆది వాసీ సంస్కృతిలో అది అతి తక్కువ స్థాయిలో కనిపించినప్పటికీ) అయితే దానిని మానవ జీవితంలో ప్రధాన విషయం చేసి చాలా ఆకర్షణీయంగా విపులీకరించి ఒక ప్రచండ భోజ్య సంస్కృతిని సృష్టించింది బూర్జువా వ్యవస్థ. ఆ వ్యవస్థను 'మార్చేస్తే' మనలోని ఆ వైఖరి పోదు. ఆ వైఖరిని మనం మానవీయంగా నియంత్రించుకోగలిగినప్పుడే బూర్జువా వ్యవస్థను 'మార్చేయ' గలుగుతాం. స్టాలిన్ ఇనుపగోడలు, చియాంగ్ చింగ్ నిషేధాలు, విప్లవ ప్రచార హోరు ఆ భోక్త వైఖరిని పోగొట్టలేవు. మనం దానిలో ఉన్న ఆకర్షణను వాస్తవికంగా గుర్తిస్తూనే దానిలోని అమానుషత్వాన్ని అర్థం చేసుకొని ఆ భోజ్య సంస్కృతిని నైతికంగా తిరస్కరించే విలువలను సామాజిక చైతన్యంలో బలంగా పెంచుకోగలిగినప్పుడే పెట్టుబడిదారీ వ్యవస్థను అధిగమించగలుగుతాం. అంత దాకా అది రాక్షసుడి తలలాగ ఎన్నిసార్లు నరికి వేస్తే అన్ని సార్లు తిరిగి మొలుస్తూనే ఉంటుంది. ఆ ప్రత్యామ్నాయ నైతిక సంస్కృతి సాధ్యం కావచ్చునేమోనని నమ్మడానికి ఆధారమేమిటంటే భోక్త వైఖరి మనిషిని ఆకర్షించినట్టే అందుకు భిన్నమయిన సంస్కృతి కూడ మనిషికి మరొక కోణంలో చాలా సంతృప్తిని ఇవ్వగలదు. ఈ ప్రపంచాన్ని భోజ్య వస్తువుగా కాక తనలో భాగంగా, తనను ఈ ప్రపంచంలో భాగంగా చూసే మమైక్యతా సంస్కృతి కూడ మనిషికి స్వాభావికంగానే సంతృప్తి నిస్తుంది. దీనిని మానవ జీవితంలో ప్రధాన విషయం చేయడం సాధ్యమైతేనే కమ్యూనిజం సాధ్యం అవుతుంది. 'పెట్టుబడి' అంటే కేవలం సంపద కాదు. అదొక సామాజిక సంబంధం అన్న మార్క్స్ విశ్లేషణను మార్క్సిస్టులు తరచుగా ఉటంకిస్తుంటారు. అదొక

సామాజిక సంబంధం మాత్రమే కాదు. ఒక ప్రాపంచిక దృక్పథం, ఒక జీవన వైఖరి. దానికి భిన్నమైన మమైక్యతా దృక్పథం కమ్యూనిస్టు జీవన వైఖరి. ఈ అవగాహన మార్క్స్ తొలి రచనలలో (ముఖ్యంగా ఎకనమిక్ అండ్ ఫిలసాఫికల్ మేనుస్క్రిప్ట్స్‌లో) ఉంది. కానీ తరువాతి కాలంలో తన సిద్ధాంతాన్ని విశదీకరించినప్పుడు ఆయన ఈ అవగాహనకు ప్రాముఖ్యం ఇవ్వలేదు. దానికి తిరిగి ఈ మధ్య కాలంలో ప్రాణం పోసే ప్రయత్నం చేస్తున్నది మార్క్సిస్టులు కాదు. మార్క్సిస్టులు తృణీకరిస్తున్న పర్యావరణ ఉద్యమ కారులు. అయితే వాళ్ల తాత్విక బలహీనతల వల్ల వాళ్లు ఈ పని సక్రమంగా చేయలేకున్నారు.

మనిషికి ఉన్న వివిధమైన మానసిక అవసరాలు, స్థితులు, వైపరీత్యాలు పాలక భావజాలానికి మనుషుల ఆలోచనలను ఆక్రమించుకునే అవకాశం కల్పిస్తున్నాయని గుర్తిస్తున్నామంటే ఆ మానసిక స్థితులనూ అవసరాలనూ 'కండెమ్' చేస్తున్నామని కాదు. అవి మన అస్తిత్వంలో భాగం. మన కాళ్లూ చేతులూ ఎట్లాగో అవీ అట్లాగే. వాటి ఫలితంగా మన జీవితం అమానుషంగా తయారు కాకుండా వాటి అభివ్యక్తిని మానవీయంగా మలచుకోవడం ఒకటే మనం చేయగల పని. ఈ అవసరాన్ని మార్క్సిజం ఇప్పటి వరకు గుర్తించలేదు. దీని గురించి కొంత ఆలోచించింది మార్క్సిస్టుల చేత పెటీ బూర్జువా సోషలిస్టులుగా తిరస్కరించబడిన ఎరిక్ ఫ్రాం, బర్ట్రాండ్ రస్సెల్ వంటి వారే. ఇది నైతిక, సాంస్కృతిక స్వభావం గల రాజకీయ కృషి. ఉదాహరణకు, అన్ని రకాల దోపిడీ దౌర్జన్యాలూ అసమానతలూ ఎప్పటికయినా తొలగి పోయినా మానవ జీవితంలో అపరిపూర్ణత ఇంకామిగిలి పోతుంది. మనిషితన గురించి తన జీవితాన్ని గురించి ఊహించుకోగల పరిపూర్ణతకు, నిజంగా సాధించగల దానికీ మధ్య ఒక అగాధం ఎప్పుడూ ఉంటుంది. కాల్పనికంగా దానిని పూరించుకొని ఊహాత్మకంగా సంతృప్తి పొందే ప్రయత్నం చరిత్ర చివరి దాకా సజీవంగానే ఉంటుంది. అయితే ఇది ఊహను నిజమని నమ్మజూపే భావజాలం రూపంలో కాక ఊహను కాల్పనిక సృష్టిగా స్పష్టంగా గుర్తించే సాహిత్యం, కళల రూపంలో జరగగలిగితే అమానుషతకు తావు లేకుండా చూడవచ్చు. అందువల్ల మానవ జీవితాన్ని మానవీయంగా పునర్నిర్మించే ప్రయత్నంలో 'అవాస్తవిక' కాల్పనిక సాహిత్యానికి తనదయిన స్థానం ఎప్పుడూ ఉంటుంది.

ఊహాత్మక పునస్సృష్టి వల్ల వచ్చే మానసిక సంతృప్తి ఒకెత్తు. జీవితాన్ని విశదీకరించడానికీ వివరించడానికీ ఒక సాహిత్య శిల్ప సాధనంగా దానికి ఉండే ప్రయోజనం వేరొక ఎత్తు. మరణానంతర ఊహనే ఉదాహరణగా తీసుకుందాం. పరలోక భావనలో అనేక రకాల సౌకర్యం ఉంది. ఇక్కడ జరగడం సాధ్యం కాని వెన్నో అక్కడ జరగగలుగుతాయి. అక్కడ, కాలం స్తంభించి పోతుంది. కాబట్టి చరిత్రలో కలుసుకోవడం సాధ్యం కాని వ్యక్తులు మరణానంతరం కలుసుకోగలరు. అక్కడ దూరం అనేది ఉండదు. కాబట్టి అందరూ ఒకే సమయంలో ఒకే చోట ఉండగలరు. అక్కడ మనుషులకు ప్రకృతి, సమాజం ఏర్పరచిన దిన చర్య అనేదేదీ ఉండదు.

కాబట్టి వాళ్ళు ఏ సమయంలోనయినా ఏ పనయినా చేయగలరు. అక్కడ అందరూ స్వతంత్రులే కాబట్టి ఒకరికొకరు భయపడకుండా ప్రవర్తించగలరు. ఇక్కడి జీవితంలో జరగవలసినవి అనేకం జరగకుండా పోవడానికి ఈ భయం ఒక ముఖ్యకారణం. హిట్లర్ చేతిలో చనిపోయిన యూదులు సహితం పరలోకంలో అతనిని ఎదిరించి మాట్లాడగలరు. అయితే మరణానంతర మరణం అనేది లేదు కాబట్టి హిట్లర్ కూడ వారికి తార్కికంగాను నైతికంగాను భయపడాలే తప్ప శారీరకంగా భయపడనవసరం లేదు. తార్కిక సంవాదం అక్కడ భౌతిక హింస వల్ల అర్థాంతరంగా ఆగి పోనవసరం లేదు.

ఇన్ని సదుపాయాలున్న మరణానంతర జీవిత భావన ఒక రచయిత చేతిలో అనేక విషయాలను విశదీకరించడానికి సాధనంగా ఉపయోగపడగలదు. పరలోకంలో మార్క్స్ స్టాలిన్‌ను కలుసుకున్నప్పుడు ఆయన సిద్ధాంతం పేరిట స్టాలిన్ నెలకొల్పిన క్రూరమయిన నియంతృత్వం గురించి ఇద్దరూ ఏ విధంగా వాదులాడుకొని ఉంటారు? అదంతా సోషలిజాన్ని కాపాడుకోవడానికి అవసరం అని ఈ లోకంలో చాలా మందికి ఈనాటికీ నమ్మింపచేసినట్టు మార్క్స్‌ను కూడ స్టాలిన్ నమ్మించి ఉంటాడా?

ఈ కోవకుచెందిన ఊహ ఒకటి సోవియట్ రష్యాలో జోక్‌గా చలామణిలోఉండేది. మార్క్స్‌కు మళ్లీ ప్రాణం వచ్చి ఆయన భూలోకంలోకి వస్తాడు. తన వారసులు నిర్మించిన రాజ్యం చూద్దామని సోవియట్ రష్యాకు పోతాడు. అక్కడ కొన్నాళ్లు పర్యటించి అన్నీ చూస్తాడు. ఆ తరువాత తన అభిప్రాయం ప్రజలకు తెలియజేయడానికి ప్రభుత్వ రేడియోలో అవకాశం ఇమ్మని సోవియట్ ప్రభుత్వాన్ని కోరతాడు. ప్రభుత్వానికి తప్ప వేరే ఎవ్వరికీ ప్రజలతో మాట్లాడే హక్కు ఉండగలదని గుర్తించని సోవియట్ పాలకులు మొదట ఒప్పుకోరు. కానీ ఆయన చాలా బ్రతిమాలగా కేవలం ఒక్క వాక్యం మాట్లాడే అవకాశం ఇస్తామంటారు. మార్క్స్ తనకదే చాలని చెప్పి రేడియో స్టేషన్‌లో మైక్ చేతిలోకి తీసుకొని "ప్రపంచ కార్మికులారా! నన్ను క్షమించండి!' అన్న ఏకవాక్య సందేశం ఇచ్చి వెళ్లిపోతాడు.

ఈ మధ్య వియత్నాంలోని హోచిమిన్ సిటీ (సైగాన్)లో వియత్నాం ఏకీకరణ ద్విదశాబ్ది ఉత్సవం భారీ ఎత్తున జరిగింది. ఆ ఉత్సవం ఖర్చంతా భరించి స్పాన్సర్ చేసింది ఒక అమెరికన్ మల్టీ నేషనల్ కార్పొరేషన్! ఈ వార్త 'యమనాడు'లో చదివిన హోచిమిన్ అక్కడే ఉన్న మావోతో ఏమని మొరపెట్టుకుని ఉంటాడో! అయినా వాళ్లిద్దరూ అసలు మాట్లాడుకుంటున్నారో, లేక తూర్పు ఆసియా ప్రచ్ఛన్న యుద్ధ రాజకీయాలు యమలోకంలో కూడా కొనసాగుతున్నాయో.

హిట్లర్ ఫాసిజాన్ని చాలా పట్టుదలగా ధైర్యంగా ఎదుర్కొన్నందుకు స్టాలిన్ పాలనలోని సోవియట్ ప్రజలు ప్రపంచ ప్రశంసలు అందుకున్నారు. ఈ రోజు ఆ తరువాతి తరం రష్యా ప్రజలు తమ స్వంత జాతి ఫాసిస్టు జిరినోవ్‌స్కీని అధికంగా ఆదరిస్తున్నారనీ, అతను రాబోయే ఎన్నికలో రష్యా అధ్యక్షునిగా గెలవవచ్చుననీ తెలిసి పరలోకంలో ఉన్న హిట్లర్ అక్కడే ఉన్న

స్టాలిన్‌ను ఎంతగా ఎద్దేవా చేస్తున్నాడో! 'చివరి విజయం నాదే చూడు' అంటున్నాడా?

అమెరికా ప్రజాస్వామ్యం మూల పురుషులయిన థామస్ పెయిన్, థామస్ జెఫర్సన్, జార్జి వాషింగ్టన్ మొదలయిన వాళ్లంతా పరలోకంలో ఉన్నారు. వారి వారసులు ప్రజాస్వామ్య పరిరక్షణ పేరిట హతమార్చిన 30 లక్షల మంది వియత్నామీలు కూడా అక్కడే ఉన్నారు. ఈ జనమంతా థామస్ పెయిన్‌ను, జెఫర్సన్‌ను ఏమని నిలదీసి అడుగుతున్నారో! వారి సరసనే కంపూచియాలో పోల్ పాట్ కమ్యూనిజం పేరిట హతమార్చిన 20 లక్షల మంది కంపూచియన్లు ఉన్నారు. వాళ్లు అక్కడికి చేరుకోగానే మార్క్స్‌ను వెతికి పట్టుకొని ఉంటారు. వాళ్ళ ప్రశ్నల నుండి తప్పించుకోవడానికి ఆయన ఎక్కడ దాక్కున్నాడో!

బుర్ర రాములు ఇటువంటి సన్నివేశం ఒకటి ఎంచుకున్నాడు. ఈ లోకంలో న్యాయం పేరిట కోర్టులలో నడిచే నేర విచారణలోని అన్యాయంతో ఒక్క క్షణం కూడా రాజీ పడని నర్రా ప్రభాకరరెడ్డి యమలోకంలో ధర్మం పేరిట నడిచే చిత్రగుప్తుడి ప్రాసిక్యూషన్‌కు ఏ విధంగా స్పందించి ఉంటాడు? ఆ 'ధర్మం' ఇక్కడి 'న్యాయానికి' ప్రజల తల ఒగ్గింపజేసే భావజాలమే కదా!

ఆ ధర్మం న్యాయానికి పర్యాయపదం అని ఇహలోకంలో నమ్మింపజూసిన గాంధీ ఆ లోకంలో చీఫ్ ప్రాసిక్యూటర్ అయ్యే ఉంటాడు కదా? అయితే సత్యాన్ని అత్యున్నత మైన విలువగా ప్రతిపాదించిన వాడు యముడి ప్రాసిక్యూటర్‌గా ఉండడంలో గల వైరుధ్యానికి ఎట్లా తట్టుకుంటాడు? కళ్ళూ చెవులూ నోరూ మూసేసుకోవడం తప్ప గత్యంతరం ఉంటుందా?

మనిషి ఔన్నత్యాన్ని గురించి ఎన్ని ఉపన్యాసాలు ఇచ్చినా ఆ ఔన్నత్యాన్ని దిగజార్చే మద్యాన్ని వదులుకోలేని శ్రీశ్రీ, రావిశాస్త్రివంటి అభ్యుదయ రచయితలు ఈ లోకంలో నడుస్తున్న మద్య వ్యతిరేక ఉద్యమాన్ని గురించి 'యమనాడు' లో చదివి ఏ విధంగా స్పందించి ఉంటారు? నిస్సందేహంగా ఆహ్వానించి ఉంటారని బుర్ర రాములు విశ్వాసం. దానితో విభేదం లేదు. కానీ తాము మాత్రం పర్మిట్లు తీసుకొని ఉంటారేమో! యముడికే తెలియాలి.

బహుశా ఒక్క కౌటిల్యుడిని మినహాయిస్తే తక్కిన బ్రాహ్మణ ధర్మశాస్త్ర కారులంతా రాజద్రోహాన్ని సెక్యులర్ నేరంగా కాక ధర్మద్రోహంగా భావించారు. సారా నిషేధం పాలిసీ వికృత విన్యాసాల మీద రావిశాస్త్రి రాసిన ఆరు సారా కథలపైన ఈ లోకంలో రాజద్రోహం కేసు పెట్టడానికి మనువునూ కౌటిల్యుడినీ దాటి చాలా దూరం ప్రయాణించిన ఆధునిక భారత రాజ్యాంగం అడ్డం వచ్చిందేమో కానీ, దానిని ధర్మద్రోహంగా రూపాంతరం చేసి కేసు పెట్టడానికి యముడికి అడ్డం ఏముంది?

అయితే యముడి ధర్మం మధ్య యుగాల నాటిదే అయినా ఈ ప్రాసిక్యూషన్‌లో అది ఎదుర్కునే ప్రత్యర్థులు అత్యాధునికులు. 'ధర్మం', 'న్యాయం' అనే మాటల వెనుక ఉన్నతమయిన విలువలతో పాటు ఎంత మాత్రం ఉన్నతం కాని రాజకీయముంటుందని తెలిసిన అరుణక్క,

దేవేంద్రక్క, సాహు ఉన్నారు. సారా వ్యాపార వ్యవహారం మొత్తం చెప్పగల సి.వి.సుబ్బారావు ఉన్నాడు. ఏ అధికారానికీ ఎన్నడూ తల ఒగ్గని నర్రా ప్రభాకరరెడ్డిఉన్నాడు. అంతా పోగొట్టుకొని ఇంక పోగొట్టుకునేది ఏమీ లేదని తెగించిన నూకాలమ్మలున్నారు. అందరికీ పెద్ద దిక్కు శ్రీశ్రీ ఉన్నాడు. చివరికి ప్రాసిక్యూషన్ వారు ముద్దాయికి విజయవంతంగా శిక్ష వేస్తారా? లేకపోతే భూలోక రాజకీయాల ధిక్కార వైఖరి అలవరచుకున్న ఈ కొత్త తరం ప్రజలకు భయపడి వదిలి పెడతారా? లేక తామే కోర్టు హాలు విడిచి పెట్టి ఉడాయిస్తారా? ఇది ఊహించే కొద్దీ ఆలోచనలను ఊరించే సన్నివేశం.

ఉద్యమ కథా సాహిత్యం ఒకే మూసలో పోసిన శైలిలో ఉండనవసరం లేదనీ, ప్రగతి సంబంధమయిన నిబద్ధత, సీరియస్‌నెస్ అనేవి 'స్పిరిట్'కు సంబంధించిన విషయాలే తప్ప వస్తువుకు గానీ, శిల్పానికి గానీ సంబంధించినవి కావనీ బుర్ర రాములు కథ ఇచ్చే సందేశాన్ని ఉద్యమ రచయితలు స్వీకరిస్తారని ఆశిద్దాము. ఇటువంటి సందేశాలు ఇప్పటి దాకా ఎవరూ ఇవ్వనే లేదని కాదు. కానీ పదే పదే ఇవ్వవలసిన అవసరం ఇంకా మిగిలే ఉంది.

హైదరాబాదు **కె. బాలగోపాల్**

26.5.95

ముందుమాట
ఏ జో సారా కథ
బుర్రరాములు
ప్రచురణ: పర్స్పెక్టివ్స్
హైదరాబాద
1995 జులై 30